



● ప్రమాదమని తెలిసినా..

ఎల్‌ఎండీ గేట్లు పైకెత్తి నీటిని విడుదల చేయడంతో చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం వస్తున్నారు. ప్రమాదమని తెలిసినా వరద ప్రవాహానికి దగ్గరగా వెళ్లి తిలకించారు. ఫొటోలు తీసుకున్నారు. అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలు వస్తున్నాయి.

- ఎండీ షుకూర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ఉప్పొంగిన వాగులు, వంకలు

- పలు చోట్ల భారీ వర్షం
- హుజూరాబాద్, చిగురుమామిడిలో అత్యధిక వర్షపాతం
- ఎల్‌ఎండీ నుంచి 30వేల క్యూసెక్కుల నీటి విడుదల
- మరో మూడురోజుల పాటు భారీ వర్ష సూచన



సోమారం-ఎక్లాస్‌పూర్ గ్రామాల మధ్య లో లెవల్ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. వాగులు ఉప్పొంగాయి, చెరువులు మత్తడి దూకాయి. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఇవే పెద్ద వర్షాలు కావడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్, శంకరపట్నం, చిగురుమామిడి మండలాల్లో భారీగా కురిసిన వానలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి చెరువులు అలుగు పారాయి. హుజూరాబాద్ పట్టణంలోని గాంధీనగర్, బుడగజంగం కాలనీ, మామిండ్ల వాడలో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక, సరిపోక రోడ్లమీద వర్షపునీరు వరదలా పారింది. జమ్మికుంటలో 179.00 మి.మీ. వర్షం కురిసి హౌసింగ్ బోర్డుకాలనీ పూర్తిగా జలమయమైంది. సైదాపూర్ మండలంలో 149 మి.మీ. వర్షపాతం నమోదై పంట పొలాలు నీట మునిగాయి. సైదాపూర్ మండలంలో సోమారం వాగు ఉధృతంగా ప్రవహించడంతో మోడల్ స్కూల్ వసతిగృహం చుట్టూ వరదనీరు చేరింది. నీరు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శంకరపట్నం మండలంలో కురిసిన భారీ వర్షంతో అర్కండ్ల గ్రామ లెవల్ బ్రిడ్జిపై ఉధృతంగా నీరు ప్రవ హించి రాకపోకలు నిలిచిపోయా యి. వీణవంక మండలం నర్సింగా పూర్, కనపర్తి గ్రామాల్లో పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. ఇల్లంద కుంట మండలంలో 82.4 మి.మీ. వర్షం కురిసింది. హుజురా బాద్, సైదాపూర్ మండలాల్లో పలు చెరువులు, కుంటలు మత్తడిదూకాయి. చిగురుమామిడి మండ లంలో ఉరుములు, మెరుపులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఇందుర్తి రేణుకాఎల్లమ్మ వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. తిమ్మాపూర్ మండలం పోరండ్ల, మన్నెంపల్లి గ్రామాల మధ్య కల్వర్టుపై, జుగుండ్ల రామ్‌హనుమాన్‌నగర్ (మిగతా 6వ పేజీలో)

● సైదాపూర్ మోడల్ స్కూల్ జలమయం



విద్యార్థినులను బయటకు తీసుకువస్తున్న స్థానికులు

సైదాపూర్ : సైదాపూర్ మోడల్ స్కూల్ సోమారం గ్రామ శివారు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వాగు పొంగి వరద నీరు మోడల్‌స్కూల్ చుట్టూ చేరింది. వసతిగృహంలో 32 మంది విద్యార్థినిలు, ముగ్గురు సిబ్బంది చిక్కుక పోయారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాత్రివేళ భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం స్థానికులు విద్యార్థినిలును సురక్షితంగా బయటకు తీసుకరావడంతో అందురూ ఊపిరి పీల్చుకున్నారు.

● ఎల్‌ఎండీ 10గేట్లు ఎత్తివేత



ఎల్‌ఎండీ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్ (మానకొండూర్) : రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్‌లోని దిగువ మానేరు జలాశయం నిండు కుండలా మారింది. జలాశయంలోకి భారీ ఇన్‌ఫ్లో వస్తుండటంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకు 10 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం 23.301 టీఎంసీలకు చేరింది. మోయతుమ్మెద వాగు నుంచి 23,745 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 6,000 క్యూసెక్కులు మొత్తం 29,745 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 10గేట్ల ద్వారా 36,000వేల క్యూసెక్కులు వదులుతున్నారు. రాత్రి వరకు ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తివేసే అవకాశం ఉన్నది.



చిగురుమామిడి మండలం ఇందుర్తి పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్ట రేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నియం త్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితా లను ఇస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ మూలా లను పెకిలించి వేయాలని పేర్కొ న్నారు. ప్రైవేట్ మెడికల్ స్టోర్స్‌లోనూ ముమ్మరంగా తనిఖీలు చేపట్టి డ్రగ్స్ అమ్మకాలను పరిశీలించాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పోలీసు శాఖ తరఫున విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని, డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వ హిస్తున్నా మని అన్నారు. సమావేశంలో అడిష నల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డీఓ మహే శ్వర్, అధికారులు పాల్గొన్నారు.

● ప్రైవేట్‌కు ధీటుగా అంగన్‌వాడీ సేవలు



వెలిచాల శుక్రవారం సభ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు: శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు ప్రైవేట్‌కు ధీటుగా బోధిస్తున్నారని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పంచాయతీ భవనంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లా డుతూ శుక్రవారం సభ ద్వారా గ్రామ స్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం, ఇతర విషయాల పట్ల అవగాహన వస్తోందని అన్నారు. తనతో పాటు పిల్లల పోషణ ఎలా ఉందో తెలు సుకోగలు గుతున్నారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠ శాలల్లో సుమా రు 8 వేల అడ్మిషన్లు పెంచా మని తెలిపారు. గ్రామంలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇమ్యునై జేషన్ అధికారి సాజిద, తహసిల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, సీడీపీవో నర్సింగ రాణి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

● రైతులకు తప్పని ఇబ్బందులు



సైదాపూర్‌లో యూరియా కోసం రైతుల భారీ లైన్లు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతుల ఇక్కట్లు తప్పడం లేదు. శుక్రవారం నగునూర్ ఆగ్రోస్‌కు 400బస్తాలు, కరీం నగర్ సింగిల్ విండోకు ద్వారా చెర్లబూ త్కూర్‌కు 400బస్తాలులోడ్ రాగా రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. ఏఈవో వచ్చి టోకెన్‌ల ద్వారా రైతులకు యూరియా బస్తాలనుఅందజేశారు. చెర్లబుత్కూర్ లోని యూరియా పాయింట్ వద్దకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి చేరుకుని పంపి ణీని పరిశీలించారు. అనంతరం రైతులను పొలాల వద్దకు తీసుకెళ్లి నానో యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఏడీఏ రణధీర్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి. సత్యం, ఏఈఓలు ఉన్నారు.

● మానకొండూర్ : మానకొండూర్‌లోని ఆగ్రోస్ కార్యాలయానికి శుక్రవారం యూరియా వస్తుందన్న సమాచారం మేరకు రైతులు కార్యాలయానికి చేరుకొని క్యూలైన్‌లో నిలుచున్నారు. కొంత మంది నిల్చుండే ఓపిక లేకపోవడంతో ప్రక్కన కూర్చున్నారు. ఒక్కొక్క రైతుకు రెండేసి యూరియా బస్తాలు ఇవ్వడంతో రైతులు చేసేది ఏమిలేకఅసంతృప్తితో వెళ్లిపోయారు.

● శంకరపట్నం : శంకరపట్నం మండలంలో రైతులు గోదాముల వద్ద తెల్లవారు జామున యూరియా కోసం బారులు తీరారు. మండల పరిధిలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి, ముత్తారంలో ఫర్టిలైజర్ షాపునకు యూరియా బస్తాలు రాగా రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అధి కారుల సమక్షంలో రైతుకు ఒక బస్తా చొప్పున అందజేశారు.

● సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌కు యూరియా లోడ్ వస్తుదని తెలిసి రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున లైనులో వేచి ఉన్నారు. నిర్వాహకులు 170 బస్తాలు వస్తున్నాయని ఒకొక్కరికి ఒక్కో బస్తా చొప్పున టోకెన్లు ఇచ్చారు. టోకెన్లు చివరి రైతులకు రాకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. వెన్కేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మకల్ గ్రామానికి 450 బస్తాలు రాగా టోకెన్లు పంపిణీ చేశారు. రాయికల్‌లో రైతు వేదిక వద్ద చెప్పులు లైనులో పెట్టి వేచి ఉన్నారు.



చెర్లబూత్కూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు



గద్దపాకలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రాణాలకు రక్ష..

● నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం

4

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసం

● ఐపాడ్, 2 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం

4

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ ముట్టడిం చారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు కలెక్టరేట్ లోకి చొచ్చుకుపోతుండటంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం విద్యార్థి సంఘ నాయకులను వాహనంలో తరలించారు. విద్యార్థులను రెచ్చగొడు తున్నారని ఇద్దరిని పోలీసులు పట్టుకుని అనంతరం వదిలివేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ స్కాలర్‌షిప్ ప్రభుత్వ భిక్ష కాదు విద్యార్థుల హక్కు అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తుండగా విద్యార్థులకు మొండిచేయి చూపించిందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో చాలా ప్రైవేటు కళాశాలలు మూసివేస్తున్న పరిస్థితి నెలకొందని అన్నారు. దాంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పరోక్షంగా కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి బకాయిలను వెంటనే విడుదల చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విగ్నేష్, నగర కార్యదర్శి చిప్ప యోగేష్, భామండ్ల నందు, జోనల్ ఇంచార్జిలు ఆకాష్, హరీష్, ప్రశాంత్, సుధీర్‌సింగ్, అశ్విని, అభినయ్, పావని, అక్షయ, అక్షిత, విష్ణు, నాగరాజు, స్ఫూర్తి, గాయత్రి, వంశీ, చరణ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు



కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు, పాల్గొన్న విద్యార్థులు

గ్రామీణులకు అందుబాటులో

సర్కార్ వైద్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- పర్లపల్లి గ్రామంలో పల్లె దవాఖాన ప్రారంభం



పర్లపల్లిలో పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్(మానకొండూర్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు సర్కార్ వైద్యం అందుబాటులో ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామంలో పల్లె దవాఖానను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యంతో పాటు సౌకర్యాలు కల్పించిందన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోలంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌ఎల్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, రమణారెడ్డి, రంగారావు, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాధాకిషన్ రావు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు
- స్టేజ్ 2లో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం



జ్యోతినగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. 2400 మెగావాట్ల సామర్థ్యంగల టీఎస్ టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యా వరణ అనుమతులను(ఈసీ) గురువారం రాత్రి సర్క్యులర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన 4 వేల మెగావాట్ల టీఎస్‌టీపీపీకి సంబంధించి 1600 మెగావాట్ల స్టేజ్1 ఇప్పటికే పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 2016లో శంకుస్థాపన అయిన స్టేజ్ 1 ఏడాదిన్నర క్రితం పూర్తయింది. మిగతా 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.

● తెలంగాణ సూపర్ థర్మల్ కేంద్రం నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మేరకు ఎన్టీపీసీ సంస్థ తెలంగాణలో 4 వేల మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాలని పేర్కొంది. ఈ మేరకు రామగుండం ఎన్టీపీసీలోనే 4వేల ప్రాజెక్టును నెలకొల్పేందుకు కేంద్రం ఎన్టీపీసీకి అనుమతినిచ్చింది. మొదటగా 1600 మెగావాట్ల ప్రాజెక్టును రామగుండంలో 2016లో మొదలుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ టీఎస్‌టీపీపీకి శంకుస్థాపన చేశారు. 5 సంవత్సరాలలో పూర్తి కావాల్సిన స్టేజ్ 1 కరోనా ఇతర కారణాల వల్ల 2023లో పూర్తయింది. స్టేజ్ 1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లను ప్రధాని మోదీ 2024లో జాతికి అంకితం చేశారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టుకు ఎన్టీపీసీకి గత ఏడాది ఎన్టీపీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అనుమతినిచ్చారు. సుమారు 29,800 కోట్ల రూపాయల వ్యయానికి బోర్డు అనుమతినిచ్చింది. దీంతో స్టేజ్ 2 నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. రెండో దశ కాంట్రాక్టు బీహెచ్ఈఎల్‌కు లభించింది. టీఎస్‌టీపీపీ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణకే కేటాయిస్తారు. మరో ఒకటి, రెండు నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి. 2030 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు మొదలు పెట్టనుంది.

● కొనుగోలుకు ఒప్పందంపై సందిగ్ధత..

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2కు సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) విషయంలో ఇంకా సందిగ్ధత ఉంది. పీపీఏ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. స్టేజ్2 నుంచి యూనిట్‌కు 4.12 రూపాయలకు కొనుగోలు చేసుకునేందుకు ఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ రాష్ట్ర సర్కారు పీపీఏ చేసుకోలేదు. 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే కొనుగోలు చేసుకునేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ పీపీఏ మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. పీపీఏ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎన్టీపీసీ వేచి చూస్తున్నట్లు సమాచారం.

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 వివరాలు..

- **సామర్థ్యం:** 2400 మెగావాట్లు(800 మెగావాట్ల 3 యూనిట్లు)
- **ప్రాజెక్టు వ్యయం:** 29,800 కోట్లు
- **టెక్నాలజీ:** ఆధునిక సూపర్ క్రిటికల్ టెక్నాలజీ
- **నీటి సౌకర్యాం:** సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా సరఫరా
- **బొగ్గు లింకేజీ:** సింగరేణి నుంచి ఏడాదికి 11.5 మిలియన్ టన్నుల బొగ్గు

కరీంనగర్‌లో సినిమా షూటింగ్



ఎల్ఎండీ గేట్ల వద్ద జరుగుతున్న షూటింగ్

తిమ్మాపూర్ (మానకొండూర్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం వద్ద హీరో శ్రీకాంత్ సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఏడు కొండలవాడా వెంకటరమణ(గోవిందా గోవిందా) అనే శీర్షికతో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో డ్యామ్‌లో పడ్డ హీరోను చూస్తూ విలపిస్తున్న సంఘటన చిత్రీకరణ చేశారు. హీరోయిన్ లయ తదితర తారాగనం వివిధ పాత్రలలో నటించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌కు ఎన్నోసార్లు వచ్చాను... కానీ షూటింగ్ మాత్రం ఇదే మొదటి సారి అని అన్నారు. కరీంనగర్‌లో సినిమా షూటింగ్ చేయడం సంతోషంగా ఉందని ఇక్కడి అధికారులు, పోలీసులు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పది రోజులు ఇక్కడే షూటింగ్ జరుగుతుందన్నారు. నవంబరులో సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

- గంటపాటు నిలిచిన రాకపోకలు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గంగాధర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై గల రైల్వేగేటు శుక్రవారం మొరాయించింది. గేటు లేవకపోవడంతో గంటపాటు ప్రధానరహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్రఇబ్బంది పడ్డారు. అనంతరం సిబ్బంది మరమ్మతులు జరిపి గేటు ఎత్తారు. కరీంనగర్, జగిత్యాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గేటు లేవకపోవడంతో తీవ్రఇబ్బందులుపడ్డారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సమయానికి గమ్యం చేరలేకపోతున్నామని వాపోయారు. తరచుగా ఇదేపరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోయారు. అధికారులు గేటు మొరాయించకుండా చూసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

మందు బాబులకు జరిమానా

వేములవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 130మంది మందుబాబులకు వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు. 14రోజుల వ్యవధిలో మద్యం సేవించివాహనాలు నడుపుతూ పట్టుబడిన 130మందిని శుక్రవారం వేములవాడ న్యాయస్థానంలో హాజరుపరిచామని తెలిపారు. ఇందులో 30మందికి 10వేల చొప్పున, 30మందికి 5వేల చొప్పున, మరో70మంది వాహనదారులకు 2000 రూపాయల చొప్పున న్యాయమూర్తి ప్రవీణ్ జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాల నడిపిన వారికి కౌన్సె లింగ్ నిర్వహించి మరోసారి మద్యం సేవించకుండా వారితో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో శుక్రవారంఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో నలుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు పురుషులు, నలుగురు మహిళలు హుజూరాబాద్ మండలం చెల్పూర్ నుంచి ఆటోలో బయలుదేరి మొగిలిపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కేశవపట్నం గ్రామంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలుకాగా వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్

- రూ.2.4 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- పరారీలో ఇద్దరు



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన కంసాని అరుణ్ కారు డ్రైవర్‌గా, హమాలి కార్మికునిగా, టైల్స్‌వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదనపై దృష్టి పెట్టి గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడని తెలిపారు. ఈక్రమంలో కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బొల్లేద్దు మహేందర్, చీమల ఆకాష్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశా రాష్ట్రంలోని గుర్తుతెలియని వ్యక్తులనుంచి తక్కువధరకు గంజాయిని కొనుగోలు చేసి, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులకు, యువకులను లక్ష్యంగా చేసుకొని కిలో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇల్లందుకు చెందిన మహేందర్, ఆకాష్‌ల వద్ద అరుణ్ గంజాయి కొనుగోలు చేసి కారులో హుస్నాబాద్‌కు చేరుకున్నాడని తెలిపారు. హుస్నాబాద్, పెద్దపల్లి, ఓదెలప్రాంతంలో గంజాయిని విక్రయించి వస్తుండగా పొత్కపల్లి ఫంక్షన్ హాల్ శివారులో పోలీసులు కారును తనిఖీ చేయడంతో డిక్కీలో గంజాయి లభించిందని తెలిపారు. రూ.2.4 లక్షలవిలువచేసే 4.98కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరుణ్ పట్టుబడగా ఇల్లందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాష్‌లో పరారీలో ఉన్నారని ఏసీపీ తెలిపారు. గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై రమేష్, ఏఎస్ఐ రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజుయాదవ్, హరీష్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేష్‌లను డీసీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసం

- మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ అరెస్టు
- ఐపాడ్, 2 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం



నిందితుడు మాజీకార్పొరేటర్ కట్ల సతీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడిపెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మబలికి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లోకేష్, సాయి అనే మరోఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుడు కట్లసతీష్ వద్ద నుంచి ఒకఐపాడ్, 2 సెల్‌ఫోన్‌లు, ఇతర ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కరీంనగర్ సీసీఎస్ సీఐ ప్రకాశ్‌గౌడ్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ మెటా ఫండ్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని పట్టణానికి నునావత్ భాస్కర్‌ను నమ్మించాడు. తనవద్ద డబ్బులు లేవని చెప్పగా బయట 5శాతం వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో 3రెట్లు అవుతాయని నమ్మబలికాడు. దీంతో భాస్కర్ 2024జూన్ 4న సరస్వతి నగర్‌లోని తన ఇంటిలో కట్లసతీష్‌కు 15లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి కింద ముట్టజెప్పాడు. ఆ తరువాత మరి కొందరిని ఈ స్కీంలో చేరిపిస్తే మరిన్ని లాభాలు వస్తాయని చెప్పగా నమ్మిన భాస్కర్ తనకు పరిచయం ఉన్న కళ్లెం పహిపాల్‌రెడ్డి, మహేందర్, అజ్మీర తిరుపతి, బి.చంద్రనాయక్, బాలు నాయక్, బి.చందు, కె.తిరుపతి, బి. మహేష్, మంగీలాల్, అరుణ్, రామచంద్రమూర్తి, జి.రాందాస్, జలపతి, జి ఫకీర్దాస్, ఆర్.వెంకటేశ్వర్‌రావు, వంగల రూప, మోతె కరుణాకర్‌రెడ్డిని అదే నెల 11న భాస్కర్ ఇంట్లో సమావేశపరిచాడు. మూడు నెలల్లో 3 రెట్లు లాభాలు వస్తాయని కట్లసతీష్ వారిని నమ్మించాడు. 17మంది వద్ద మధ్యవర్తి మోతె సాయి ద్వారా కోటి 20 లక్షలు రూపాయలు కట్ల సతీష్ తీసుకున్నాడు. కాని ఇంత వరకు ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. కట్ల సతీష్‌ను నమ్మి వడ్డీకి డబ్బులు తెచ్చి ఇచ్చామని, వడ్డీ కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని భాస్కర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శించుకున్న సినీ నటుడు చిన్న



సినీ నటుడు చిన్నకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్నఆలయానికి వచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు చిన్న..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ప్రముఖ సినీనటుడు చిన్న దర్శించుకున్నారు. శుక్రవారం రాజన్నఆలయానికి విచ్చేసినఆయన శ్రీస్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ళ జైలుశిక్షవిధిస్తూ శుక్రవారం జిల్లాజడ్జి కుంచాల సునీత తీర్పునిచ్చారు. 2017లో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి పట్టణానికి చెందిన బాలిక పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు కిరాణ షాపునకు వెళ్లింది. ఇంటికి తిరిగి వెళ్తుండగా మందల రవి అరు వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను ఇంటి వద్ద దింపుతానని ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. పట్టణ శివారుచెట్ల పొదల్లోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. కూతురు ఇంటికి రావడం లేదని తల్లి వెతుకుతుండగా బాలిక ఎదురుపడి జరిగిన విషయం తెలిపింది. తల్లి ఫిర్యాదుతో అప్పటిఎస్సై తడవేన శ్రీనివాస్ మందల రవిపై కేసు నమోదు చేశాడు. కోర్టు పీపీ బాదం రమేష్, అరెల్లి రాములు సాక్ష్యులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో జడ్జి పదేళ్ళ జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించారు. అలాగే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నుంచి బాధితురాలికి 2 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముకుంద అనిల్(22) గతఏడాదిగా కుటుంబసభ్యులకు దూరంగా ఉండి ఒంటరిగా ఉంటూ కిరణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండునెలలుగా అనిల్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఒంటరితనం భరించలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి బలవన్మరణం



శరత్ కుమార్(ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ గ్రామానికిచెందిన సంగ శరత్ కుమార్(23) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శరత్ డిగ్రీచదవడం మధ్యలోనే మానివేసి హార్వెస్టర్ కొనుగోలు చేసి దానిని నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా అతను సంవత్సరం నుంచి ఛాతినొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శరత్‌కుమార్ తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన స్నేహి తులకు తాను చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టినట్లు సమాచారం. కాగా ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణం కావచ్చని స్థానికులు చర్చించుకుంటు న్నారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు రావడం శుక్రవారం స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 17,715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మళ్లీ ఎగువ మానేరు పరవళ్లు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు, సిద్దిపేటలోని కూడవెళ్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో మానేరు మత్తడి దూకుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు శుక్రవారం 14630 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13000, మానేరు ములవాగు ద్వారా 1630క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. కాగా దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు, ప్యాకేజి10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజి9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.82 ఉండగా, నీటినిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.093 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.06టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతు వేదికలో షార్ట్‌సర్క్యూట్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతువేదికలో యూరియా పంపిణీ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్విచ్‌బోర్డులో ఒక్కసారిగా మంటలు చెరగడంతో రైతులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన అధికారులు, రైతులు మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది.



స్విచ్ బోర్డ్ వద్ద మంటలు

హిమాచల్‌ప్రదేశ్‌లో కొండూరుకు ఘన స్వాగతం

గంభీరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా విమానాశ్రయంలో నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఘన సన్మానం లభించింది. శనివారంలో సిమ్లాలో జరగనున్న జాతీయ సహకార సమావేశానికి (సహకార పునర్జీవం) కొండూరు హాజరుకానున్నారు. సమష్టి సహకార బలం ద్వారా ఐవైసీ-2025 కార్యక్రమం కోసం రవీందర్‌రావు హిమాచల్ ప్రదేశ్‌కు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యక్రమ ప్రతినిధులు రవీందర్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు.



సిమ్లా విమానాశ్రయంలో కొండూరు రవీందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ప్రాణాలకు రక్ష..

- నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం



సుభాష్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్నా.. ప్రమాదంలో గాయపడినా వైద్యసహాయం, అంబులెన్స్ వచ్చేవరకు ప్రాణాలను కాపాడటానికి అందించే తక్షణ వైద్య సహాయమే ప్రథమ చికిత్స. సెప్టెంబరు నెలలో రెండవ శనివారం ప్రపంచ ప్రథమచికిత్స దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రథమచికిత్స అంటే డ్రెస్సింగ్ నుంచి చిన్నవ్యాధుల చికిత్స, సీపీఆర్ (కార్డియాక్ పల్మనరీరెసాసిటేషన్)వరకు ఉంటాయి. ప్రథమచికిత్సకు నిపుణుడు లేదాశిక్షణ పొందిన వ్యక్తిలేదానిర్దిష్ట పరికరాలు, సామగ్రి అవసరం లేదు. అందుబాటులో ఉన్న వనరులతో పరిసరాలను తెలిసిన వ్యక్తికూడా ప్రథమచికిత్స అందించవచ్చు. అధికారిక ప్రథమచికిత్స ఉత్తమమైనప్పటికీ అప్పటివరకు కొన్ని ప్రాథమిక ప్రాణాలను రక్షించే పద్ధతులు, నైపుణ్యాలను నేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

● ఎందుకంత ప్రాముఖ్యత..

అత్యసర పరిస్థితుల్లో ప్రతి సెకను విలువైనదే. సకాలంలో అందించే ప్రథమ చికిత్సవ్యక్తి ప్రాణాలను కాపాడుతుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రథమచికిత్స కీలకంగా పరిగణించబడుతుంది. ప్రమాదం జరిగిన ప్రదేశం, లేదా గాయపడిన వ్యక్తిఉన్న ప్రదేశంచాలా దూరంలో ఉండవచ్చు. ఆ ప్రదేశం దూరంగా ఉండవచ్చు. నిపుణుడు చేరుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

● నిర్వహించే కార్యక్రమాలు

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై అవగాహన, శిక్షణను ప్రోత్సహించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీపీఆర్ టెక్నిక్‌లు, పేపర్ కట్ ఎలా చేయాలి, బ్యాండేజ్ ఎలా వేయాలి, వంటివి ప్రదర్శనల ద్వారా తెలియచేస్తారు. ప్రథమ చికిత్సను నేర్చుకోవడం వల్ల ఎంత ఉపయోగకరం. కొన్ని సందర్భాల్లో ప్రథమ చికిత్స తెలిసిన వారు చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడివారు అవుతారు.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత ఆశలన్నీ నీరజ్‌పైనే



నీరజ్

స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



డుప్లాంటిస్

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు ఆర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.



దక్షిణేశ్వర్ సురేష్

తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

ఫైనల్‌కు జైస్మిన్



జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హూడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝుర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



మహ్మద్ హారిస్ (66)

దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జపనీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్‌ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్ల లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

ఉప్పొంగిన వాగులు, వంకలు

(3వ పేజీ తరువాయి)

గ్రామాల మధ్య కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. లోయర్ మానేరు డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో 10 గేట్లు ఎత్తి 30వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలారు. ఎల్ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24.030 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.558 టీఎంసీల నీరు చేరుకుంది. మానేరు నది నుంచి 23,745 క్యూసెక్కుల నీటిని వరదనీరు, మిడ్‌మానేరు నుంచి 6వేల క్యూసెక్కుల నీరు వస్తుండడంతో 30వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే ఇంకా నీటిని వదలడం పెంచే అవకాశముంది.

హుజురాబాద్ డివిజన్‌లో అత్యధికం...

హుజురాబాద్ డివిజన్‌లో అత్యధికంగా 221.5 మి.మీ. వర్షం కురిసింది. చిగురుమామిడి మండలంలో 215.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శంకరపట్నంలో 106.1 మి.మీ, సైదాపూర్ మండలంలో 149.2 మి.మీ. వర్షం కురిసింది. రాష్ట్రంలో అత్యధికంగా వర్షపాతం నమోదైన 30 ప్రాంతాల్లో హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో 197.8 మి.మీ, ఇందుర్తిలో 211.3 మి.మీ, చిగురుమామిడి మండల కేంద్రంలో 164.0మి.మీ, సైదాపూర్ మండలం వేన్నేపల్లిలో 108.0.మి.మీ, శంకరపట్నం మండలం తాడికల్‌లో 104.5 మి.మీ. వర్షం పడింది. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు మరో మూడు రోజులపాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

పశువైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్, చెర్లబూత్కూర్‌లో శుక్రవారం పాడి పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ లింగారెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య అధికారి డాక్టర్ సత్యప్రసాద్,మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, డైరీ ప్రెసిడెంట్ పంది శంకర్, కొమురయ్య పాల్గొన్నారు.

జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాల సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నాకా చౌరస్తా వద్ద త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి, తెలంగాణ చౌక్ వద్ద వన్‌టౌన్ సీఐ రామచంద్రారావు శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్‌షమీ, మాజీ కార్పొరేటర్ అలీ,కార్ఖానగడ్డ అధ్యక్షులు షోయబ్ అహ్మద్‌ఖాన్ ఉన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఐఈవో గంగాధర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో మహిళల ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో బి.ఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ డా. బి.ఎన్. రావు, డాక్టర్ అలీమ్, డాక్టర్ రామ్‌కిరణ్, నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి రమేష్ పాల్గొన్నారు.

లాభసాటి ధర వచ్చే వరకు ధాన్యం నిల్వ చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండిచిన ధాన్యాన్ని లాభసాటి ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవాలని ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాం కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బీరం ఆంజనేయులు, డైరెక్టర్‌లు బోనాల లింగయ్య, బోనాల నర్సయ్య, నిమ్మల అంజయ్య, గంట శంకరయ్య, సేవెల్ల లత పాల్గొన్నారు.

విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

భగత్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని వెలిచాల రాజేందర్‌రావును వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ మాచర్ల రజిత ప్రసాద్‌గౌడ్, స్వర్ణకార సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కట్ట జగన్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తోజు రామ్‌కుమార్ పాల్గొన్నారు.

సేవా పక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఈస్ట్‌జోన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సేవాపక్వాడ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్‌రావు, ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్, మాసం గణేష్, శశికాంత్, రాజు పాల్గొన్నారు.

శుక్రవారం సభతో మహిళా సమస్యల పరిష్కారం

భగత్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళా సమస్యలకు శుక్రవారం సభతో పరిష్కారం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో సబిత అన్నారు. శుక్రవారం చింతకుంటలోని జిల్లా పరిషత్‌పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం సంయుక్తంగా శుక్రవారం సభ నిర్వహించారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పర్శరాం, మెడికల్ ఆఫీసర్ సన పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యవర్గం నియామకం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా బండారి నరేందర్, జెట్టి బాలయ్య, రాయిశెట్టి చంద్రయ్య, చీకట్ల రాజశేఖర్, మామిడి వెంకటయ్య, కార్యదర్శులుగా కుంభం మల్లయ్య, పిట్టల మహేందర్, చొప్పరి తిరుపతి, కోశాధికారిగి గుంటుక శంకర్, గౌరవ అధ్యక్షుడిగా కొలకాని నర్సయ్య, ముఖ్య సలహాదారుడిగా పిట్టల లింగయ్యను నియమించారు.

గుడిసె దగ్ధం

భగతనగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేకుర్తి 19వ డివిజన్ బుడుగజంగాల కాలనీలో పర్వతం కనకవ్వకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం

జమ్మికుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో ప్రథమశ్రేణి జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సహా జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనుమతితోపాటు హుజూరాబాద్‌లో ఉన్న సెకండ్‌అడిషనల్ కోర్టును జమ్మికుంటలో నెలకొల్పాలని హైకోర్టు న్యాయమూర్తి ఎన్ తుకారంజికి జమ్మికుంట న్యాయవాదులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు వంగల పవన్‌కుమార్, ఏబూసి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి

జమ్మికుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జీవనజ్యోతి పట్టణ సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈఈ శ్రీకాంత్, అధ్యక్షురాలు రాణి, కార్యదర్శి మౌనిక, కోశాధికారి గీత పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా టీబీ నియంత్రణ అధికారి

శంకరపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా టీబీ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. దీర్ఘకాలికంగా దగ్గు, ఇతర టీబీ లక్షణాలు ఉన్నవారికి వెంటనే వైద్య పరీక్షలు చేయించాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్, టీబీ బృందం కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ నిలుస్తుందని 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి ఏకే జయంత అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని రాంనగర్ పోలీస్ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నుంచి పదిరోజులపాటు నిర్వహించే ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 9వ బెటాలియన్ ఏవో లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణ, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ అధ్యక్షుడిగా విజ్జిగిరి అంజయ్య

ఇల్లందకుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్ హుజూరాబాద్ డివిజన్(327) యూనియన్ నూతన అధ్యక్షుడిగా విజ్జిగిరి అంజయ్యను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కార్య దర్శిగా శ్రీపతిసుధాకర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నవీన్, ట్రెజరర్‌గా సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ, స్వరూప, కంపెనీ సెక్రటరీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

- ఇళ్లలోకి చేరిన వరద నీరు
- రాత్రంతా ప్రజల ఇబ్బందులు



అర్కండ్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

హుజూరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఈ వర్షాకాలంలో ఎన్నడూలేని విధంగా గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. మున్సిపల్‌పరిధిలోని బోర్నపల్లిలో 160 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలోని రోడ్లన్నీ చెరువుల్లా మారిపోయాయి. విద్యానగర్, పోచమ్మవాడ, మామిండ్లవాడ, కిందివాడ, బుడగ జంగాల కాలనీల్లోకి వరదనీరు భారీగా రావడంతో కాలనీవాసులు రాత్రంతా ఇబ్బందులు పడ్డారు. గ్యాస్‌గోదాం ఏరియాలోని జూట్‌బ్యాగ్ ఇండస్ట్రీలోకి నీళ్లు రావడంతో రెండున్నర టన్నుల జూట్ బ్యాగులు నీళ్ల పాలయ్యాయి. పట్టణంలోని చిలకవాగు ఉధృతంగా ప్రవహించడంతో కనుకులగిద్దె గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్డీవో రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ కనకయ్య పట్టణంలో పర్యటిస్తూ ఎక్కడ వర్షపునీరు నిల్వలేకుండా చేశారు.

- హుజూరాబాద్‌లోని వరదప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ పర్యటించారు.
- వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. జలమయమైన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పలు కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.

సైదాపూర్: మండలంలో 149.2ఎంఎం వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇదే భారీ వర్షం. వాగులు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలలోని వరి, పత్తి పంటలు మునిగిపోయాయి. సోమారం-ఎక్లాస్‌పూర్ మధ్య వాగు పొంగి లోలెవల్ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. వరద ఎక్కువగా రావడంతో పెర్కపల్లి-వెన్నేపల్లి మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులు నిలిచిపోయాయి. సైదాపూర్ మోడల్ స్కూల్ సోమారం గ్రామ శివారులో లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షానికి వాగులు పొంగి వరదనీరు స్కూల్ చుట్టూ చేరింది.

జమ్మికుంట: నాయిని చెరువు జలకళ సంతరించుకుంది. హౌసింగ్‌బోర్డు, దుర్గాకాలనీ, అంబేద్కర్ కాలనీ, ఆబాదిజమ్మికుంట, కృష్ణకాలనీ శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్, కనపర్తిలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మానేరు డ్యాం గేట్లు ఎత్తడంతో మానేరువాగు పూర్తి స్థాయిలో ప్రవహిస్తోంది. రెడ్డిపల్లిలో చింతల శంకరయ్య ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. కల్వల ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వస్తుండడంతో గండిపడిన ప్రాంతం నుంచి నీరుపూర్తిగా బయటకు వెళ్తోంది.

చిగురుమామిడి: సీతారాంపూర్ కెనాల్ వద్ద చిన్నపాటి ప్రమాదం ఉండడంతో తహశీల్దార్ రమేష్ పరిశీలించారు. ఇందుర్తి ప్రభుత్వపాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. బరిగెలపల్లి- చిగురుమామిడి రహదారి తెగింది. ఇందుర్తి ఎల్లమ్మవాగు ఉధృతంగా పొంగడంతో కోహెడ-చిగురుమామిడికి రాకపోకలు నిలిచిపోయాయి.





వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, హుజూరాబాద్‌లో బుడగజంగాల కాలనీలో చేరిన నీరు

ప్రత్యేక చేనేత ప్రదర్శన



పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): కోర్టు చౌరస్తాలోని రాజరాజేశ్వర కల్యాణ మండపంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చేనేత ప్రదర్శన, అమ్మకం స్టాళ్లను శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు ఎప్పటికీ ఆదరణ తగ్గదన్నారు. చేనేత కళాకారుల నైపుణ్యం ఇక్కడ ప్రదర్శించిన వస్త్రాల్లో కనిపిస్తున్నదన్నారు. అనంతరం కలెక్టర్ పలు స్టాళ్లను సందర్శించి చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

భగత్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి దాత సహకారంతో బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో సొంత కాళ్లపై నిలబడాలన్నారు. ఈ సందర్భంగా దాత మేడి నగేష్‌ను అభినందించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఈవో ఆనందం, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



లియోక్లబ్ సభ్యులతో లయన్స్ క్లబ్ సభ్యులు

భగత్‌నగర్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి):లియో క్లబ్‌లో చేరి విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చు కోవాలని జిల్లా గవర్నర్ లయన్ ఎస్. కోదండరామ్ అన్నారు. శుక్రవారం అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల లియో క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. సమాజహిత కార్యక్రమాలతో క్లబ్ అవార్డులు పొందడం గర్వకారణమన్నారు. క్లబ్ ప్రెసిడెంట్ కె.సహశ్రీ, సెక్రటరీ కె.తపస్విభు, కోశాధికారి ఎస్.శ్రీవిద్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. కళాశాల చైర్మన్ లయన్ వి.రవీందర్ రెడ్డి, ఫస్ట్ వైస్‌గవర్నర్ భద్రేశమ్, లియో క్లబ్ సలహాదారు మధుసూదన్‌రెడ్డి, లయన్ రమష్, జగదీశ్వరాచారి, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, సురేందర్, మహేందర్ ఉన్నారు.

కొత్త శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

చిగురుమామిడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి 64వ జన్మదిన వేడుకలను శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ ఎంపీపీ అకావరం శివప్రసాద్-బావాణి, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, కత్తుల రమేష్‌యాదవ్, నాయకులు పెనుకుల తిరుపతి, ముక్కె సదానందం, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, బుర్ర తిరుపతి, జనార్దన్‌రెడ్డి, ఎండీ సర్వర్ పాషా, ఎస్కె సిరాజ్, పిల్లి వేణు, ఒంటెె కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్‌కు అల్ఫోర్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అథ్లెటిక్స్‌కు నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కరీంనగర్ అర్బన్ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్‌లో సీహెచ్ శ్రియాన్స్ వర్మ అండర్-14 విభాగంలో 400 మీటర్లు, 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, బాలికల విభాగంలో పి.ఆరాధ్య షాట్‌పుట్‌లో రజతం, ఎస్.వైష్ణిక అండర్-17 విభాగంలో ట్రిపుల్ జంప్‌లో రజతం సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు

భగత్‌నగర్: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థిని ఎం.ఈశానా ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అభినందించారు. కరీంనగర్‌లో యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 12బాలికల విభాగంలో ప్రతిభ చాటినట్లు చెప్పారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయం హుండీ ఆదాయం రూ.8,20,340లు వచ్చినట్లు ఈవో సుధాకర్ తెలిపారు.

గణేశ్‌నగర్: జిల్లాకేంద్రంలోని సూర్యనగర్ ఆర్టీసీవర్క్‌షాప్ ఎదుట పద్మశాలి భవన్‌లో ఆదివారం నిర్వహించనున్న బీసీ మేధావుల సదస్సును విజయవంతం చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ టి చిరంజీవులు ప్రకటనలో కోరారు.

భగత్‌నగర్: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎలగందల్ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, పీడీహరీష్ అభినందించారు.

-నగరంలోని సీతారాంపూర్‌లో అక్రమ కట్టడాలను స్వాధీనంచేసుకోవాలని సీపీఐ జిలా కార్యదర్శి పంజాలశ్రీనివాస్ డిమాండ్ చేశారు.

గంగాధర: మండలంలో యూరియా పంపిణీకి శుక్రవారం రైతులకు టోకెన్లను అందించారు. శనివారం యూరియాను పంపిణీ చేయనున్నట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు.

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లాకబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లాజట్ల ఎంపికపోటీలను నిర్వహించనున్నామని జిల్లాకబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చెన్నాడిఅమిత్‌రావు, రాష్ట్రఉపాధ్యక్షులు సీహెచ్ సంపత్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి బుర్రమల్లేష్‌గౌడ్ తెలిపారు.

సుభాష్‌నగర్: ఈనెల15న కోల్‌ఇండియా ఆల్ పెన్షనర్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో కలకత్తాలోని కోల్‌ఇండియా కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

ఇల్లందకుంట: జడ్పీహెచ్ఎస్‌లో టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

వీణవంక: సెప్టెంబరు 17న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ జిల్లా కన్వీనర్ ఇనుగండ్ల నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

-మండలంలోని వల్భాపూర్‌కు చెందిన బూర శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్లనరహరి రూ.10వేల సాయం చేయగా గుణసాగర్ బాధితులకు అందించారు.

శంకరపట్నం: మండలకేంద్రంలోని కేజీబీవీలో హెడ్‌కుక్, కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తు గడువును పొడగించినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల16లోపు అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: చాంపియన్స్ కరాటే డో అకాడమీ ఆధ్వర్యంలో రేకుర్తిలో ఈనెల14న సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు చీఫ్‌ఆర్గనైజర్ ప్రసన్నకృష్ణ, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ మాడుగుల ప్రవీణ్ తెలిపారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వమహిళా కళాశాల జీవశాస్త్ర విభాగంఆధ్వర్యంలో బీఎస్సీలైఫ్‌సైన్స్ విద్యార్థులు క్షేత్ర పర్యటన చేపట్టారు.

● అవీఇవీ..

కరీంనగర్ క్రైం: మంకమ్మతోటలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలు, జాగ్రత్తలపై సైబర్ క్రైం ఎస్సై అనిల్ అవగాహన కల్పించారు.

గంగాధర: గంగాధర మండల రజక సంఘం నాయకుడు సంపత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్,డ్రై క్లీనింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణను సన్మానించారు.

కరీంనగర్ టౌన్: సీతారాంపూర్‌లో వెంకటరమణరెడ్డి అనుమతి లేకుండా షెడ్, ప్రహరీ నిర్మించారంటూ ఎ.రాధకృష్ణ ఫిర్యాదుతో కూల్చేసినట్లు అధికారులు తెలిపారు.

కరీంనగర్ రూరల్: ఎస్‌జీఎఫ్ కరీంనగర్ రూరల్ మండల స్థాయి బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం వావిలాల పీహెచ్‌సీ పరిధిలోని కోరపల్లిలో డాక్టర్ బిందు ఆధ్వర్యంలో, మున్సిపల్‌పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో డాక్టర్ మహోన్నత ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను హుజూరాబాద్‌లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధి కారులతో రివ్యూమీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపడుచులకు సద్దుల బతుకమ్మకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. హుజూరాబాద్‌లో కోతుల బెడద నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలతో జరిగిన ఆస్తి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, రూరల్ ఏడీఈలు, శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, రఘు తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు పద్మశాలి వీధి, షా సాహెబ్ మహల్, పాత బజార్, తెలంగాణ చౌక్, రాఘవేంద్ర నగర్, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు, ఉదయం 9గంటల నుంచి 11 వరకు, మార్క్‌ఫెడ్ ఏరియా, రాంనగర్, ప్రగతినగర్, మంకమ్మతోట, వాసర ఆస్పత్రి, రాజీవ్ పార్క్, టెలిఫోన్ క్వార్టర్స్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెర్లబూత్కూర్, దుబ్బపల్లి, ఫకీర్‌పేట్, చామనపల్లి జూబ్లీనగర్, బహదూర్‌ఖాన్‌పేట, ఎలాబోతరం, ముగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, 9:30 నుంచి ఉదయం 11:30 వరకు కొత్తపల్లి (హెచ్), రేకుర్తి సబ్-స్టేషన్, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు చింతకుంట, కమాన్‌పూర్, మల్కాపూర్, లక్ష్మీపూర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు నగునూర్, వల్లంపహాడ్, తీగల గుట్టపల్లిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం పట్టణ వ్యాప్తంగా ఉదయం 10నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్, ఆముదాలపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రఘు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని కాచాపూర్, రాజపూర్, కల్వల, ఆముదాలపల్లి, మెట్‌పల్లి వినియోగ దారులు సహకరించాలని కోరారు.

రెనేలో అధునాతన గుండె చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెనే ఆస్పత్రిలో అధునాతన గుండె చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన అజయ్ (15) అనే బాలుడికి పుట్టినప్పటి నుంచే గుండెకు రంధ్రం ఉందని, ఓపెన్ హార్ట్ సర్జరీ ఖర్చుతో కూడుకున్నది కావడంతో మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ(ఎంఐసీఎస్) చేసినట్లు తెలిపారు. ఈ విధానంతో ఛాతి భాగంలో పూర్తిగా చీరకుండ, పక్కటెముకల మధ్యలో చిన్న గాటు పెట్టి, ప్రత్యేకమైన పరికరం ద్వారా ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. అనంతరం బంగారిస్వామి మాట్లాడుతూ హైదరాబాద్ కంటే అతితక్కువ ఖర్చులో గ్రామీణులకు అధునాతన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆస్పత్రిలో సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్డియాలజీ డాక్టర్ దినకర్, చిన్న పిల్లల గుండె వైద్యుడు డాక్టర్ రాజా విజయేందర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్‌బాబు, జనరల్ మేనేజర్ పవన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 19నుంచి 21వరకు జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను శుక్రవారం హుజూరాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాచర్లరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు భాషవేణి రాజేష్, జాయింట్ సెక్రెటరీ మురళీమోహన్, ఉపాధ్యక్షుడు యాకు బ్అలీ, ఎడ్లకుమార్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, రమేష్, రాజేష్, మధుకర్, రాజేందర్, వెంకటయ్య, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, నరేందర్, సృజన్, భిక్షపతి, సంపత్, ఆదిత్య, శ్రీశైలం పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి' నిర్మాణంపై అబద్ధాలు



సమావేశంలో మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించామని, ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్ మూసికి తరలిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు అబద్ధాలు ఆడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా రూ.3,177 కోట్లతో ఎల్లంపల్లికి శ్రీకారం చుట్టి తెలంగాణ వచ్చే వరకు 3,347.27 కోట్లు ఖర్చు పెట్టారని, తెలంగాణ ఏర్పడేనాటికి ఏనాడూ 5 టీఎంసీలకు మించి నిల్వ చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ రూ.2,0 52.73 కోట్లు వెచ్చించి పూర్తి స్థాయిలోకి వినియోగంలోకి తెచ్చారన్నారు.యూరియా కోసం రైతులు తల్లడిల్లుతుంటే పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

భగత్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దుర్గామాత నవరాత్సోత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలోని వెలిచాల ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నగరంలోని ఒకటి రెండు ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టిస్తామన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల నర్సన్న, ఆకుల ప్రకాశ్, ఆర్మమల్లేశం, కోటగిరి భూమా గౌడ్, గంట శ్రీనివాస్, నాయకులు బొమ్మ ఈశ్వర్‌గౌడ్, మూల రవీందర్‌రెడ్డి, పిట్టల రవీందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.